జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 02-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 716 పేజీలు: 4 వెల : రూ.7

# సూర్య ప్రతాపం

- పత్రికల్లో కథనాలొస్తే ఈయనకు 'పండగే'
- క్షేత్రస్థాయి పరిశీలన పేరిట అడ్డగోలు దోపిడీ!
- మంత్రి చివాట్లు పెట్టినా తగ్గని 'కూన' అండ..
- 'దీపం' సంబరాల పేరిట డీలర్ల గుండెల్లో రైళ్లు!
- డ్రైవర్‌కూ రూ.2 వేలు ఇచ్చుకోవాల్సిందే..
- రిటైర్మెంట్‌కు ముందే 'చేతినిండా' వెనకేసుకునే పనిలో జిల్లా అధికారి

# వసూళ్ల పర్వం






శ్రీకాకుళం, జులై 1 (వార్త):
జిల్లా పౌర సరఫరాల శాఖలో అక్రమాల సూర్యుడు నడి నెత్తికెక్కాడు. నిత్యం ప్రజాసేవలో ఉండాల్సిన ఒక ఉన్నతాధికారి, కలెక్షన్ల వేటలో పడి నియోజకవర్గాలను చుట్టేస్తున్నారనే ఆరోపణలు జిల్లా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్య ప్రకాశం పర్యటన పేరు చెబితేనే అటు డీలర్లు, ఇటు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు గజగజ వణికిపోతున్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షించాల్సిన సదరు అధికారి.. సొంతానికి ఉప్పులు, పప్పులు, బియ్యం, చింతపండు, వంటనూనెతో సహా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా 'మామూళ్ల' రూపంలో దండుకుంటున్నారనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి.

## పత్రికా కథనాలే పెట్టుబడి.. తనిఖీలే ఆదాయ వనరు!

సాధారణంగా ప్రభుత్వ అధికారులపై పత్రికల్లో వ్యతిరేక కథనాలు వస్తే వారు ఉలిక్కిపడతారు. కానీ, మన డీఎస్ఓ శైలి వేరు. ఎక్కడైనా రేషన్ అక్రమాలు లేదా గ్యాస్ ఏజెన్సీల లోపాలపై వార్తలు వస్తే ఈయనకు ఐదో వేలు నోట్లోకి వెళ్లినట్లేనని సమాచారం. ఆ వార్తలను ఆసరాగా చేసుకుని 'క్షేత్రస్థాయి పరిశీలన' పేరుతో రంగంలోకి దిగడం.. సదరు డీలర్లపై లీగల్ చర్యల భయం చూపి కనీసం రూ.10,000 బాధేయడం ఈయనకు నిత్యకృత్యంగా మారిందని బాధితులు లబోదిబోమంటున్నారు. గ్యాస్ గోడౌన్లలో ఉండాల్సిన కొత్త సిలిండర్లు, స్టవ్‌లు, రెగ్యులేటర్లు ఈయన కార్యాలయానికి, నివాసానికి కోకొల్లలుగా చేరిపోతున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

## 'దీపం' సంబరాల చాటున చీకటి వసూళ్లు!

ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'దీపం 2' రెండేళ్ల సంబరాలు ప్రభుత్వానికి పేరు తెచ్చాయో లేదో కానీ, జిల్లాలోని గ్యాస్ డీలర్ల గుండెల్లో మాత్రం రాళ్లు వేశాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 30కి పైగా గ్యాస్ ఏజెన్సీల నుంచి డీఎస్ఓ గారి ఆదేశాలతో భారీ వసూళ్ల పర్వం సాగిందని తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని పెద్ద ఏజెన్సీల నుంచి రూ.25,000 చొప్పున, కనీసం నెలకు వెయ్యి సిలిండర్లు కూడా అమ్మలేని చిన్న ఏజెన్సీల నుంచి రూ.10,000 చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సభా నిర్వహణ కోసం లక్షల రూపాయలు వసూలు చేసిన సదరు అధికారి, తీరా సభకు వచ్చిన సామాన్య ప్రజల కోసం కనీసం ఒక్క ఫ్యాన్ కూడా బిగించకపోవడం గమనార్హం. తీవ్రమైన ఉక్కపోతతో జనం సభ మధ్యలోనే వెనుదిరిగారు. వసూలైన సొమ్ములో సగానికి పైగా డీఎస్ఓ జేబుల్లోకే వెళ్ళిందని, పోనీ మిగతా సిబ్బందికి ఏమైనా ఇచ్చారా అంటే అదీ లేదని సమాచారం. దీంతో వారు కూడా విడిగా వసూళ్లకు తెరలేపినట్లు టాక్.

## డ్రైవర్‌కూ 'సమర్పించుకోవాల్సిందే'..!

డీఎస్ఓ పర్యటనకు వస్తున్నారంటే చాలు క్రింది స్థాయి సిబ్బంది హడలిపోతున్నారు. సదరు అధికారికి రూ.10,000తో పాటు, ఆయన డ్రైవర్‌కు కూడా మరో రూ.2,000 'మామూలు' ఇచ్చుకుంటేనే ఫైళ్లు ముందుకు కదులుతాయని ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమ వసూళ్ల పర్వంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. సదరు అధికారిని పిలిపించి గట్టిగానే మంత్రి చివాట్లు పెట్టినప్పటికీ, జిల్లాకు చెందిన నేత కూన సిఫారసుతోనే తాను ఇక్కడికి వచ్చానని, తనను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో




డీఎస్ఓ వ్యవహరిస్తున్నట్లు భోగట్టా. రాజకీయ రక్షణ కవచం ఉండటంతోనే ఆయన ఎలాంటి శిక్షలకూ భయపడటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

## కంచిలి అని చెప్పి..

## పలాసాలో 'వార్నింగ్'!

నిన్నటికి నిన్న పలాసాలో గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనంగా రూ.60 వసూలు చేస్తున్నారనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. దీంతో అధికారిక పర్యటన కంచిలి అని చెప్పి.. రూట్ మార్చి పలాసా వెళ్లిన డీఎస్ఓ.. "కలెక్టర్ స్వయంగా ఎంక్వైరీ చేయమన్నారు" అంటూ సదరు డీలర్‌ను బెదిరించి గట్టిగానే వసూలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## రిటైర్మెంట్ ముందే 'లక్ష్యం' పూర్తి చేయాలని..!

గతంలో ఏ అధికారి కాలంలోనూ లేని విధంగా, గడిచిన ఏడాది కాలంగా ప్రతి ప్రభుత్వ కార్యక్రమం పేరుతో అన్ని ఏజెన్సీలపై ఈ వసూళ్ల భారం పడుతోంది. సదరు డీఎస్ఓ గారికి మరో ఏడాదిన్నర కాలం మాత్రమే రిటైర్మెంట్‌కు సమయం ఉండటంతో, ఈ లోపే చేతినిండా సంపాదించుకోవాలనే ఏకైక లక్ష్యంతో ఈ వసూళ్ల పర్వానికి తెరలేపారని బాధితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగానికి చెందిన వారు స్పందించి ఈ 'సూర్య' ప్రతాపానికి అడ్డుకట్ట వేయాలని జిల్లా ప్రజలు, డీలర్లు కోరుతున్నారు.

# మందసకు.. ఏమైంది?

- ఒక వైపు ప్రాజెక్టులు వదిలేస్తున్నారు
- మరో వైపు చారిత్రాత్మక కట్టడాలు కూలిపోతున్నాయి
- నోరు మెదపని నాయకులు
- ఇప్పటికే వెనుకబడిన ప్రాంతంగా మందసకు గుర్తింపు







మందస, జులై 1(వార్త): ఆభరణాల పెట్టెకు ప్రతిరూపం మందస. అలనాటి మంజూష.. నేడు మందసగా పిలవబడుతోంది. రాజులు, జమీందారులు మంజూషను కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. రాజుల కాలంలో మంజూష అభివృద్ధి పథంలో నడిచింది. గుడులు, గోపురాలు, చారిత్రాత్మక కట్టడాలు వారసత్వ సంపదగా వస్తున్నాయి. మందస పాలకోవా ఎంతో ప్రసిద్ధి. అదేవిధంగా రాజులు, జమీందారుల కాలంనాటి నిర్మాణాలు, కట్టడాలు కూడా అంతకన్నా ఎక్కువగా ప్రసిద్ధి చెందాయి. మందస మండల కేంద్రంగా ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకంజ వేస్తోందని ప్రజలు భావిస్తున్నారు. పలాస నియోజకవర్గం ఏర్పడ్డాక.. తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల నాయకులకు ఓట్లకు మందస మండలమే కీలకంగా మారింది. వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు ఉన్న మందసకు పలు కార్యాలయాలు, పథకాలు.. ప్రాజెక్టులు మంజూరవుతున్నప్పటికీ అవి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఇది ఎవరి లోపమో అర్థం కావడంలేదు. నాయకులు మందసపై శీతకన్ను వేశారని ప్రజలు లోలోపల చెప్పుకుంటున్నారు. గిరిజన ప్రాంతంగా కూడా గుర్తింపు ఉన్న మందసకు మంజూరు కావాల్సిన ప్రాజెక్టులు కూడా మంజూరు కావడంలేదు. అరకొరగా వస్తున్న పథకాలు, కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతుండడంతో మందస ప్రాధాన్యత తగ్గిపోతోంది. ఇప్పటికే కేవలం మండల కేంద్రంగానే మిగిలిపోతున్న మందస.. మరి కొద్ది కాలంలో మండల కేంద్రమన్న ప్రాధాన్యత కూడా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంది. ఎందుకంటే.. మందస మండలంలోని హరిపురం కేంద్రంగా మండలం ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పుకొంటున్నారు. ఇదే జరిగితే మందస దిష్టిబొమ్మగా మాత్రమే మిగులుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం చర్చలు, కబుర్లుతోనే మందస అభివృద్ధి కాలం వెళ్లదీస్తోంది. నాయకుల్లో చలనం లేదు. ప్రజలు పోరాటం చేయలేదు. ఒకప్పటి ఉద్యమాల గడ్డ వెలవెలబోతోంది. ఒకరో, ఇద్దరో ముందుకు వచ్చి పోరాటం చేస్తామన్నా.. వారికి మనోధైర్యం, బలం ఇచ్చే పరిస్థితి లేదు. కొన్ని ప్రాంతాల్లో రాజకీయాలకు అతీతంగా తమ ప్రాంతాలను అభివృద్ధిచేసుకుంటుండగా.. మందసలో మాత్రం తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కుదరడంలేదని భావిస్తున్నారు.కనుమరుగవుతున్న ప్రాచీన కట్టడాలురాజులు, జమీందాల పాలనతో మందసకు ఓ మంచి పేరు వచ్చింది. కాలక్రమేణా ఆ కట్టడాలు కనుమరుగవుతున్నాయి. చివరకు ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ ఏర్పడి.. వాటిని సంరక్షించుకోవడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మందసకు వస్తున్న నిర్మాణాలు, పథకాలు ఇతర ప్రాంతాలకు తరలిపోతుండగా.. ఈ ప్రాంతంలో ఉన్న అరుదైన నిర్మాణాలు అంతరించిపోతున్నాయి. మందస చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న వీటిని తొలగించేస్తున్నారు. వాస్తవానికి అభివృద్ధి పనులు చేసేటప్పుడు పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా చర్చలు జరిగి.. ఎలా చేస్తే బాగుంటుంది.. ఏమి చేస్తే మంచి జరుగుతుందో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. ఒక కమిటీ ఏర్పాటు చేసి, పనులను జరిపితే బాగుంటుందని పెద్దలు చెబుతారు. కానీ.. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఎవరి ఇష్టానురాజ్యంగా వారు వ్యవహరిస్తుండడంతో వందల ఏళ్ల చారిత్రక సంపద కనుమరుగుతోంది. పోనీ.. నూతన నిర్మాణాలు కొంతకాలమైనా ఉంటాయా.. అంటే అదీ ఉండదు. ఓ పదేళ్లు.. లేదా 15ఏళ్లు తరువాత వాటి రూపురేఖలు మారిపోతాయి. ఇటువంటి సమయంలో అలనాటి మంజూష.. నేటి మందసలోని చారిత్రాత్మక సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రజల నుంచి భావన వ్యక్తమవుతోంది. మందస పురాతన కట్టడాలు మాయం కావడంపై భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## వేడుకగా..

✳ శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ✳ పార్టీ శ్రేణుల నడుమ వేడుకలు ✳ నీలమణి అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే ✳ వేలాది మందికి అన్నదానం ✳ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

# ఎంజీఆర్ జన్మదినోత్సవం


పాతపట్నం, జులై 1 (వార్త): పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) జన్మదిన వేడుకలు బుధవారం వేలాది మంది అభిమానుల సమక్షంలో పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంజీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారితో పాతపట్నం మండల కేంద్రం కిటకిటలాడింది. కార్యాలయంలో అభిమానుల సమక్షంలో ఎంజీఆర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంతకుముందు ఎంజీఆర్.. పాతపట్నం నీలమణి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తరలివచ్చి ఎంజీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



























# ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- ఎమ్మెల్యే శిరీష**

**పలాస, జులై 1 (వార్త):** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వినోద వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నగరవనాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలోని “మయూరి వనం” వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్చువల్ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలను అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు వర్చువల్ ద్వారా అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన వాతావరణాన్ని ఆస్వాదించేలా నగరవనాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పలాస నియోజకవర్గంలోని మెండు ఫారెస్ట్ ప్రాంతంలో 120 ఎకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్ల వ్యయంతో ఈ నగరవనాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీకి అత్యంత సమీపంలో, జాతీయ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన ఈ నగరవనానికి “మయూరి వనం” అని నామకరణం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ నగరవనంలో ప్రజలు ఉదయ, సాయంత్ర వేళల్లో నడక, వ్యాయామం, యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువైన సదుపాయాలు, విశ్రాంతి ప్రదేశాలు, పచ్చదనం నిండిన వాతావరణం కల్పించడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడడంలో ఇటువంటి నగరవనాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టి, రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధితో ప్రజలకు ఉపయోగపడే పర్యావరణహిత అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరూ ఈ నగరవనాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సప్నికల్ దినకర్, పలాస ఆర్డీవో ఆర్ అప్పలరాజు, పలాస తాసిల్దార్ బి శ్రీదేవి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఇతర ముఖ్య నాయకులు, కూటమి నాయకులు, అటవీశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## మహిళా ఎంటర్‌ప్రైనర్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం

**- వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**



**మందస, జులై 1(వార్త):** స్వయం సహాయక సంఘాలలో పంచ సూత్రాలు ప్రకారం నడుస్తున్న సంఘాలన్నింటినీ సర్వే చేసి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న మహిళా ఎంటర్ ప్రైనర్ లందరినీ ప్రభుత్వం రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సేర్ఫ్) ద్వారా అనేక విధాలుగా ప్రోత్సహిస్తుందని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సరియాపల్లి పంచాయతీలో బి.ఎల్.ఓ.ల ద్వారా అర్హత గల ఓటర్లు అందరినీ డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేయించడానికి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మాట్లాడిన అనంతరం చిన్న బహడపల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలు బత్తిన కృష్ణవేణి ఆధ్వర్యంలో మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ ను పరిశీలిస్తూ మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఏడాది తయారు చేసిన వార్షిక రుణ(క్రెడిట్), జీవనోపాదుల ప్రణాళికల ప్రకారం మహిళలు నిర్వహించే ఆదాయావృద్ధి యూనిట్స్ లో మహిళలు తనతో పాటు నలుగురుకు పని కల్పించే అర్హులకు ఎంటర్ ప్రైనర్ లుగా ప్రోత్సహించడానికి స్త్రీనిధి, సీ.ఐ.ఎఫ్., ఉన్నతి, బ్యాంకు రుణాలతో పాటు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీమ్, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ, పీ.ఎం.మత్స్య కిషన్ యోజన తదితర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేయబడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం వీ.ఓ.ఏ. రేవతి, వెలుగు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అందరిని సేవించు-అందరిని ప్రేమించు



**పలాస, జులై 1 (వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా తన అవతార దివ్య సందేశాలలో ఎల్లప్పుడూ ముఖ్యంగా అందరిని సేవించు-అందరిని ప్రేమించు అని చెబుతూ ఉండేవారని శ్రీ సత్య సాయి విద్య విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లారామేశం పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీవారు వారి వారి రోజువారీ ఖర్చులు తగ్గించుకొని (సెల్లింగ్ ఆన్ డిసైరీస్ కోడ్) తద్వారా పొదుపు చేసిన మొత్తంతో, సమాజానికి సేవలు చేయమని సందేశాన్ని ఇచ్చేరని తెలిపారు. తదనుగుణంగారామకృష్ణాపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థి విద్యార్థులు, గత 11 సం!!ల నుండి, వాళ్ళ వాళ్ళ పాకెట్ మనీలో కొంత మిగిల్చికొంటూ, తద్వారా మిగిలిన మొత్తంతో ప్రతీనెల 1వ తారీఖున నారాయణసేవ చేస్తున్నారు. దాంట్లో భాగంగా బుధవారం అనగా జూలై 1వ తారీకు సందర్భంగా షిర్డీసాయి మందిరం దగ్గర్లో ఉన్న నారాయణలకు ఆహార ప్రసాదం, స్వామివారి విభూతి, స్వామివారి చిత్రపటాన్ని నారాయణసేవా ఇంఛార్చ్ దాలేసు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 108 సేవలు ప్రశంసనీయం




**పలాస, జులై 1 (వార్త):** పలాసలోని 108 అత్యవసర అంబులెన్స్ సేవలను ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అవని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వాహనాల నిర్వహణ, పరిశుభ్రత, అత్యవసర వైద్య పరికరాలు, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న సేవల తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని అంబులెన్స్ వాహనాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు అవసరమైన వైద్య పరికరాలు, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం, సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో సమయపాలనతో సేవలు అందిస్తున్న తీరు పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలాస 108 అంబులెన్స్ సిబ్బందిని డాక్టర్ అవని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో 108 అత్యవసర అంబులెన్స్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి కాల్‌ను అత్యంత బాధ్యతతో స్వీకరించి వేగంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన అత్యవసర వైద్య సేవలు అందించాలని సూచించారు. పలాస 108 సిబ్బంది క్రమశిక్షణ, విధి నిర్వహణ, వాహనాల నిర్వహణ, సేవల నాణ్యత పట్ల చూపుతున్న అంకితభావం ప్రశంసనీయమని డాక్టర్ అవని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదని, ప్రజలకు సమయానికి వైద్య సహాయం అందించేందుకు ఇదే నిబద్ధతతో సేవలు కొనసాగించాలని ఆమె ఆకాంక్షించారు.

## ఏపీ ఏఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ

**జి.సిగడాం, జులై1(వార్త):** ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఏపీ ఏఐఎంఎస్ 2.ఓ ద్వారా ఎరువులు పంపిణీ జర గనుందని మండల వ్యవసాయాధికారి బి.బాబ్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ముందుగా పంట నమోదు పరిశీలించుకోవాలన్నారు. పంట నమోదు, పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా, డీఏపీ కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. ఎరువులు తీసుకున్నా ఈపీఓఎస్ యంత్రంలో బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. రైతులు ఈ క్రాప్ నిర్వహించే సమయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు సహరించాలని పెర్కోన్నారు.



# రాజువయ్యా.. మహారాజువయ్యా..!

**-ప్రజా వైద్యునికి జన నీరాజనం**

**-డాక్టర్ అప్పలరాజుకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ కేడర్**



**మందస, జులై 1(వార్త):** ప్రజల ప్రాణాలు కాపాడిన దేవుడువయ్యా.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లు.. కలకాలం ప్రజా సేవలో రాజుగా కొనసాగు అంటూ.. ప్రజలు, కార్యకర్తలు ఆశీస్సుల మధ్య వైద్యుల దినోత్సవాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జరుపుకొన్నారు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ ను సన్నిధిలో డాక్టర్ దే సందర్భంగా అప్పలరాజు అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు, నాయకులు మాట్లాడుతూ ఎందరో ప్రాణాలను కాపాడిన దేవుడిగా డాక్టర్ అప్పలరాజను అభివర్ణించారు. రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ, అత్యవసర సమయాల్లో కూడా కొందరి ప్రాణాలను కాపాడారన్నారు. వైద్యరంగంలో విశేషంగా సేవలు అందించిన అప్పలరాజు కలకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని, రాజకీయాల్లో రాణించాలని, మరిని పదవులు వరించాలని కోరారు. మందసలోని వాసుదేవుని సన్నిధిలో కార్యక్రమం జరగడం శుభసూచకమని, పార్టీ మళ్లీ అధికారంలో వస్తుందని, పూర్వ వైభవం సంతరించుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ సీదిరి అప్పలరాజు కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభిమానులు, కార్యకర్తలు, స్థానికులు, నాయకులు చూపుతున్న ప్రేమ, అభిమానం, వాత్సాల్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, మండల యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, పార్టీ నాయకలు చింతాడ గణపతి, మడియా రామక్రిష్ణ, బత్తిన లక్ష్మణ్, దున్న హరిక్రిష్ణ, సవర నీలకంఠం, పులారి పితాంబరం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధిని దెబ్బతీసే వీబీజీ రామ్ రద్దు చేయాలి



**పలాస, జులై 1 (వార్త):** గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వి.బి.జి.రాంజీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జీడీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ లు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేస్తున్న ఈ చట్టానికి నిరసనగా పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపిన నాయకులు మాట్లాడుతూ వామపక్షాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే 2005లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. ఆ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు భరిస్తూ గ్రామీణ పేదలకు ఉపాధి భద్రత కల్పించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి. రాంజీ చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం నిధులు భరించాల్సి రావడం వల్ల అనేక రాష్ట్రాలు ఆర్థిక భారం మోయలేక ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం వల్ల రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారం పడటమే కాకుండా గ్రామీణ ఉపాధి భద్రత దెబ్బతింటుందని విమర్శించారు. ఇప్పటికే 14 రాష్ట్రాలు ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రాలకు అన్యాయం చేసే ఈ చట్టాన్ని ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పిస్తోందని, వి.బి.జి. రాంజీ చట్టం అమలైతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిని ఉపాధి అవకాశాలు తగ్గడంతో పాటు వలసలు పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీకి ఉరితాడుగా మారిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జూలై 1న నిర్వహిస్తున్న ఆందోళనలకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ కార్మిక సంఘం నాయకులు కుత్తుమ్ ధర్మారావు, జె.వరలక్ష్మి,ఎస్.జాన్సీ, కె. ఈశ్వరి, బి. పోలయ్య, టి.ఆనంద్, పాలిన జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



**మందస, జులై 1(వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన నిమ్మన సరోజని(44) అనే వివాహిత ఉరి వేసుకుని మరణించింది. సుమారు 24 సంవత్సరాల క్రితం భైరిసారంగపురం గ్రామానికి చెందిన సూర్యారావు అనే వ్యక్తితో వివాహం జరిగింది. దాంపత్యం బాగానే సాగుతోంది. ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. కాగా, 15 సంవత్సరాల నుంచి సరోజని మైగ్రేన్ తో బాధ పడుతోంది. విశాఖపట్నం, పలాస తదితర ప్రాంతాల్లో వైద్యం చేయించారు. కానీ, ఫలితం లేకపోయింది. ఇటీవల సైక్రాటిస్ట్ కు చూపించారు. మందులను కూడా వాడుతున్నారు. భర్త సూర్యారావు ఇంటిలో లేకపోగా.. అత్త రేషన్ బియ్యం తీసుకోవడానికి వెళ్లింది. ఈ తరుణంలో మేడ పైకి వెళ్లిన సరోజని చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన సరోజని అత్త కేకలు వేయడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని.. హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే సరోజని మరణించినట్టు వైద్యులు తెలిపారు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అప్పటి వరకు తమ కళ్ల ముందే తిరుగాడిన సరోజని మరణించడంతో భైరిసారంగపురంలో విషాదచాయలు అలముకున్నాయి.

## ఎమ్మెల్యే ఎంజీఆర్ జన్మదిన వేడుకలు

**మెళియాపుట్టి, జులై 1(వార్త):** పాతపట్నం శాసనసభ్యుడు మామిడి గోవిందరావు జన్మదిన వేడుకలు మెళియాపుట్టిలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ముందుగా దేవాలయంలో పూజా కార్యక్రమంలో నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుక నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## షైనింగ్ స్టార్‌కు ఎమ్మెల్యే శిరీష అభినందన



**పలాస, జులై 1 (వార్త):** ఈనెల 29న విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నుంచి షైనింగ్ స్టార్ పురస్కారాన్ని అందుకున్న ఇంటర్ చరిత్ర విద్యార్థిని సవర డేనియాప్రీతిని ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్తులో ప్రీతి మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024- 2026 విద్యాసంవత్సరంలో హెచ్ఈసీ గ్రూపు చదువుకున్న డేనియాప్రీతి ఈ ఏడాది ఇంటర్ పరీక్షలలో 975 మార్కులను సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విభాగంలో రాష్ట్ర స్థాయిలో టాపర్ గా నిలిచి ఈ పురస్కారానికి అర్హత పొందింది. నందిగాం మండలం విసంపల్లి గ్రామానికి చెందిన ప్రీతి తండ్రి నాగేశ్వరరావు ఉపాధ్యాయునిగా ఉండగా తల్లి జయమ్మ గృహిణి. ప్రీతికి పలువురు అభినందించారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపకులు మధుర చరిత్రకారుడు మధుబాబును ప్రత్యేకంగా పలువురు అభినందించారు.

## ఎమ్మెల్యే శిరీష చొరవతో సొండిపూడిలో పెన్షన్లు పంపిణీ

**మందస, జులై 1(వార్త):** మందస మండలంలోని సొండిపూడిలో పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పారు. సొండిపూడి గ్రామ పంచాయతీ పరిధిలో భర్తను కోల్పోయిన పీస పోలమ్మ ఎన్టీఆర్ భరోసా స్పౌస్ పెన్షన్ మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే శిరీషా కృషి అభినందనీయమని వారు అన్నారు. సొండిపూడి పంచాయతీ అధ్యక్షుడు మిస్క గణపతి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగనా ఈశ్వరరావు, కూటమి నాయకులు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి రూ.4,000లు పెన్షన్ నగదు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు చేరుస్తున్న ఎమ్మెల్యే గౌతు పాలనకు ఎంతో బాగుందన్నారు. మా ఎమ్మెల్యే ఉన్నంత వరకు ఏ ఆడబిడ్డకు కష్టం రానివ్వం అనే మాటను నిలబెడుతూ, భర్త లేని అక్కకు ఆర్థిక భరోసా కల్పించిన ఎమ్మెల్యే శిరీషా సొండిపూడి ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# కూటమి హామీలు నీటిమూటలు

**-ప్రజలకు లెక్క చెప్పాకే ఓట్లు అడగాలి**

**- అమలులో శూన్యం**

**- ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం**

**- వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి రామకృష్ణ**



**మందస, జులై 1(వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లోకి వచ్చే కూటమి అభ్యర్థులు ముందుగా 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు లెక్క చెప్పాలని, ఆ తర్వాతే ఓట్లు అడగాలని వైయస్సార్సీపి శ్రీకాకుళం జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ డిమాండ్ చేశారు. మందస మండలంలోని హరిపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ కలిసి రాష్ట్రవ్యాప్తంగా హామీల వర్షం కురిపించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిందని, ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ ఊళ్లలోకి వస్తున్నారని, ముందు పాత బాకీ తీర్చండని మడియ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఆయన 12 ప్రధాన అంశాలపై నిలదీశారు. యువతకు నెలకు 3 వేల నిరుద్యోగ భృతి, 60 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్, 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 ఆడబిడ్డ నిధి, పూర్ టు రిచ్ పథకం, పేదలకు 3 సెంట్ల స్థలంలో ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, వితంతు పెన్షన్ పెంపు, ఇంటింటికీ తాగునీటి కుళాయి, జర్నలిస్టులకు 10 లక్షల ఉచిత ఇన్సూరెన్స్, ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా, సహజ మరణానికి 5 లక్షలు, ప్రమాద మరణానికి 10 లక్షల బీమా హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాల్లో వేల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, ఉద్దానంలో ఇంకా ఫ్లోరైడ్ నీళ్లే తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 99% హామీలు అమలు చేశారని, చెప్పిన తేదీకి పెన్షన్లు, అమ్మఒడి, రైతు భరోసా ఇచ్చారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలకు కోత పెట్టిందని, వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఇసుక, మద్యం ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని ఆరోపించారు. జిల్లాలో నిరుద్యోగం తీవ్రంగా ఉంది. యువత వలస వెళ్లకుండా ఇక్కడే పరిశ్రమలు నెలకొల్పుతామని, ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఒక్క పరిశ్రమా తీసుకురాలేదు, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదు. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తే పలాస జీడిపరిశ్రమకు మహర్దశ వస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం అమరావతి పేరుతో ఒక్క ప్రాంతానికే నిధులు తరలిస్తోంది. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యను పట్టించుకోవడం లేదు” అని మడియ రామకృష్ణ విమర్శించారు. హామీలు కాదు... అమలు కావాలి. జవాబు చెప్పకుండా గ్రామాల్లోకి వచ్చి ఓట్లు అడిగే నైతిక అర్హత కూటమి నేతలకు లేదు. గ్రామాల్లోకి వచ్చే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను ఈ 12 ప్రశ్నలు గట్టిగా అడగండి. ప్రజలే మా బలం, ప్రజా సంక్షేమమే మా లక్ష్యమని తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

### మావిగన్‌తోనే

# సమగ్ర అభివృద్ధి

**-ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలి**

**-అధికార వికేంద్రీకరణే పరిష్కారం**

**- గ్రాఫిక్స్ రాజధాని వద్దు.. ప్రజల రాజధాని ముద్దు**

**- వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు**



**పలాస, జులై 1 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమన్యాయం జరగాలంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన 'మూవిగన్' ఫార్ములాతోనే సాధ్యమని, ముఖ్యంగా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఉద్ఘాటించారు. పలాస పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి రాష్ట్ర రాజధాని అంశంపై పార్టీ వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు వివరించారు.

### జగన్ మాటే శాసనం:

ఇటీవల న్యూస్ 18 తెలుగులో ప్రసారమైన గ్రాఫిక్‌ను ప్రస్తావిస్తూ దుర్యోధనరావు మాట్లాడారు. "మా నాయకుడు వైఎస్ జగన్ చాలా స్పష్టంగా చెప్పారని అన్నారు. ఏపీ రాజధానిగా మూవిగన్‌కు మేం కట్టుబడి ఉన్నాం. వచ్చే ఎన్నికల్లో మూవిగన్ వర్సెస్ అమరావతి. మూవిగన్ కావాలనుకునేవారు వైసీపీకి ఓటేస్తారు. అమరావతి కావాలనుకునేవారు టీడీపీకి ఓటేస్తారు. ప్రజలు ఎవరికి ఓటేస్తారో చూద్దాం" అని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన పూర్తిగా సమర్థించారు. మూవిగన్ అంటే ఏంటి? ఉత్తరాంధ్రకు ఏం లాభం? మావిగన్ ఫార్ములాను ఆయన విడమర్చి చెప్పారు. ' మావిగన్ అంటే మూడు రాజధానులు కాదు.. మూడు ప్రాంతాల అభివృద్ధి. విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా చేయడం వల్ల ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. సచివాలయం, సీఎం క్యాంపు కార్యాలయం విశాఖలో ఉంటే ఐటీ, ఫార్మా, టూరిజం, పోర్టు ఆధారిత పరిశ్రమలు వస్తాయి. శ్రీకాకుళం, విజయనగరం యువతకు హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సిన అవసరం లేకుండా విశాఖలోనే ఉద్యోగాలు దొరుకుతాయని, వంశధార, నాగావళి ప్రాజెక్టులు పూర్తైతే వ్యవసాయం కూడా బాగుపడుతుంది. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి శాశ్వత పరిష్కారం మూవిగనే" అని స్పష్టం చేశారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా జరుగుతాయని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తే రాయలసీమ జిల్లాలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. దీనివల్ల రాష్ట్ర సంపద ఒక్కచోటే కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరుగుతుందన్నారు.

### అమరావతిపై ఆరోపణలు

టీడీపీ హయాంలో అమరావతి పేరుతో జరిగిన అవకతవకలను ఆయన ఎండగట్టారు. "2014-19 మధ్య 33 వేల ఎకరాలను రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ పేరుతో తీసుకున్నారు. అంతకుముందే చంద్రబాబు బినామీలు, టీడీపీ నేతలు ఆ ప్రాంతంలో వేల ఎకరాలు కొనేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద ఇన్‌సైడర్ ట్రేడింగ్. రాజధాని పేరు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. సింగపూర్, జపాన్ అంటూ గ్రాఫిక్స్ చూపించారు తప్ప, ఐదేళ్లలో తాత్కాలిక భవనాలు తప్ప శాశ్వత కట్టడం ఒక్కటీ కట్టలేదు. ఉత్తరాంధ్రకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు" అని ఆరోపించారు.

### ఉత్తరాంధ్రకు అన్యాయం:

"హైదరాబాద్ లాంటి నగరం ఒక్కటి ఉండటం వల్లే రాష్ట్ర విభజన తర్వాత మనం ఇబ్బంది పడ్డాం. మళ్లీ అదే తప్పు చేసి అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర శాశ్వతంగా వెనుకబడిపోతుంది. వలసలు ఆగవు. పలాస జీడిపప్పు, టెక్కలి బెల్లం, శ్రీకాకుళం కళింగ పట్టు పరిశ్రమలు దెబ్బతిన్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోంది. ఇవన్నీ ఆగాలంటే విశాఖ రాజధాని కావాలి. ఉత్తరాంధ్ర గర్జనకు జగనే సమాధానం" అని దుర్యోధనరావు స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో మూడు రాజధానుల అంశంపై ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వలేదని, దీంతో మూడు రాజధానుల బిల్లు చట్టసభల్లో నిలిచిపోయిందని ఆయన గుర్తుచేశారు. "2024లో కూటమి ప్రభుత్వం రాగానే అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించి పనులు మొదలుపెట్టారు. కానీ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజల ఆకాంక్షలు ఇంకా తీరలేదు. అందుకే జగన్ గారు మళ్లీ మూవిగన్ అస్త్రంతో ప్రజల ముందుకు వస్తున్నారు. వచ్చే ఎన్నికలు రాజధానిపై రెఫరెండం లాంటివి" అని చెప్పారు. చివరిగా "ఉత్తరాంధ్ర ప్రజలు ఆలోచించాలి. 25 ఎంపీ స్థానాలు ఉన్న రాష్ట్రంలో అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకరిస్తే శ్రీకాకుళం, విజయనగరం ఎంపీలు ఏం సమాధానం చెబుతారు? ఉద్దానం కిడ్నీ బాధితులకు, వలస కార్మికులకు న్యాయం జరగాలంటే మూవిగనే మార్గం. అందుకే మూవిగన్‌కు ఓటేయండి.. ఉత్తరాంధ్రను గెలిపించండి" అని దుర్యోధనరావు విజ్ఞప్తి చేశారు.

# గట్టు వివాదంలో వృద్ధ దంపతులపై పాశవిక దాడి

**- రక్తపు మడుగులో బాధితులు**



**పలాస, జులై 1 (వార్త):** పలాస మండలం జగన్నాథపురంలో చోటుచేసుకున్న ఒక అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పొలం గట్టు విషయంలో మొదలైన చిన్నపాటి వాగ్వివాదం, చివరికి వృద్ధ దంపతులపై కిరాతక దాడికి దారితీసింది. గొడవ జరిగిన కొద్దిసేపటికే నిందితులు బాధితుల ఇంటిపై పడి విచక్షణారహితంగా దాడి చేయడం గ్రామంలో భయాందోళన నెలకొంది. స్థానికుల కథనం మేరకు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో జగన్నాథపురానికి చెందిన రైతు మామిడి మోహనరావు తన పొలం గట్లను బాగు చేసుకుంటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన మామిడి జగన్ అక్కడికి చేరుకుని, తన పొలం గట్టును మోహనరావు ఆక్రమిస్తున్నాడని గొడవకు దిగాడు. ఈ వివాదంపై మోహనరావు సంయమనంతో స్పందిస్తూ, ఒకవేళ నాది తప్పు ఉంటే గ్రామ పెద్దల సమక్షంలో చర్చించి గట్టును తొలగిస్తాను"అని చెప్పి అక్కడి నుండి ఇంటికి వెళ్లిపోయారు. గ్రామ పెద్దల సమక్షంలో తేల్చుకుందాం అన్న మోహనరావు మాటలను ఏమాత్రంపట్టించుకోని జగన్ కక్షపెంచుకుని, మోహనరావు ఇంటికి చేరుకున్న తండ్రీకొడుకులు, ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు మామిడి మోహనరావు, వరలక్ష్మిలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఎటువంటి కరుణ లేకుండా వృద్ధులని కూడా చూడకుండా వారిపై దాడి చేయడంతో వారు రక్తపు మడుగులో కుప్పకూలారు. స్థానికులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన వృద్ధ దంపతులను చికిత్స నిమిత్తం పలాస ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో జగన్నాథపురంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో గతంలో ఎప్పుడూ లేని ఈ సంస్కృతి పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ దాడికి పొలం గట్టు వివాదమే ప్రధాన కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది.

ఈ ఘటన వెనుక కేవలం భూ వివాదం మాత్రమే ఉందా లేక అంతకుముందే ఉన్న పాత రాజకీయ కక్షలు ఏవైనా కారణమయ్యాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# వైద్యుల్లో భారతరత్నం డా.బీసీ రాయ్

**-స్మృతివనంలో నూతన విగ్రహావిష్కరణ**

**- వైద్యరంగ ప్రముఖులకు సన్మానం**



**శ్రీకాకుళం, జులై 1(వార్త):** భారతదేశ వైద్య చరిత్రలో పేదల వైద్యునిగా కీర్తిగాంచడంతోపాటు ప్రజాప్రతినిధిగా సేవలందించి అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని అందుకున్న డా.బీసీ రాయ్ స్ఫూర్తి ఎప్పటికీ సజీవమని కేంద్రమాజీమంత్రి డా.కిల్లి కృపారాణి అన్నారు.

కొంచాడ సోమేశ్వరరావు, భాగ్యలక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న గాంధీమందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో ఏర్పాటు చేసిన డా.బీసీ రాయ్ విగ్రహాన్ని ఆమె బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృపారాణి మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పనిచేస్తూ కూడా ప్రజలకు వైద్యసేవలందించారని స్వాతంత్ర్య పోరాటం మహాత్మాగాంధీతో కలిసి పనిచేసిన చరిత్ర డా.బీసీ రాయ్‌కు ఉందన్నారు. డా.బీసీరాయ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన డా.కొంచాడ సోమేశ్వరరావును డా.కిల్లి కృపారాణి అభినందించారు. ఐతం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, విగ్రహదాత డా.కొంచాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా వైద్యునిగా, కలకత్తా మేయర్‌గా, బెంగాల్ సీఎంగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి వైద్యరంగానికే బీసీరాయ్ వన్నెతెచ్చారన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డా.కిల్లి రామ్మోహన్‌రావు, ప్రైవేట్ నర్సింగ్ హమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.కింజరాపు అమ్మన్నాయుడు, డా.మందుల మోహనరావు, డా.ధర్మాన లక్ష్మీనారాయణ, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డా.సనపల నర్సింహమూర్తి, డా.గొండు గంగాధర్, ఐఎంఏ మహిళా విభాగం పూర్వ అధ్యక్షురాలు డా.సంపతిరావు శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ బీసీ రాయ్ వైద్యరంగానికి, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. గాంధీ మందిర కమిటీ తరపున ముఖ్యఅతిథి డా.కిల్లి కృపారాణి, విగ్రహదాత డా.కొంచాడ సోమేశ్వరరావులను సత్కరించారు.

### వైద్యులకు కొంక్యాన ట్రస్టు సత్కారం

వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు తరపున వైద్యులను కేంద్రమాజీమంత్రి డా.కిల్లి కృపారాణి, ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, ట్రస్టు సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన శివశంకర్, కొంక్యాన తేజస్విని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఏపీ కార్యదర్శి డా.కూర్మాన వినోద్‌కుమార్, ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు డా.హర్షవల్లి, డా.భవానీ, డా.లక్ష్మీవాసవి, ట్రెజరర్ డా.సీపాన జ్యోత్స్న, ఎస్‌వోజీఎస్ కార్యదర్శి డా.లలితకుమారి, డా.గుణశేఖర్, డా.గుప్త, డా.సుధాకర్, డా.విజయ్‌కుమార్, డా.కోమలరావు, డా.కొంచాడ రవికుమార్, డా.ఎన్.ప్రభు, డా.కొంక్యాన మాధురి, డా.కావ్యమాల, డా.హర్షిత, డా.శ్రావ్య, డా.అభిషేక్ విలేకర్, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, చౌదరి రాధాకృష్ణ, నటుకుల మోహన్, పైడి హరనాథరావు, పొన్నాడ రవికుమార్, నక్క శంకరరావు, కొమ్ము రమణ మూర్తి , జి.నాగేశ్వరావు, గేదెల ఇందిరాప్రసాద్, పందిరి అప్పారావు, జేసీస్ అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి, బుడుమరు సూర్యారావు, గురువు మురళీ, మండా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి



**కొత్తూరు, జులై 1 (వార్త):** గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 'వి.బి.జి. రాంజీ' చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జులై 1 నుండి ఈ నూతన చట్టాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కొత్తూరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కార్మికులతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్షాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే 2005లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపుదిద్దుకుందని, గతంలో ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించి గ్రామీణ పేదలకు ఉపాధి భద్రత కల్పించేవని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి. రాంజీ చట్టం వల్ల నిధుల వాటాను కేంద్రం 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచిందని వారు విమర్శించారు. దీనివల్ల ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు తమ వాటా నిధులను కేటాయించలేక ఉపాధి హామీ పథకమే మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ కొత్త నిబంధనల వల్ల రాష్ట్రాలపై మోయలేని భారం పడుతుందని, ఇప్పటికే దీనిని వ్యతిరేకిస్తూ 14 రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశాయని పేర్కొన్నారు. కేంద్ర బీజేపీ కూటమిలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న ఈ చట్టాన్ని ఎందుకు వ్యతిరేకించడం లేదని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్ల రాయితీలు ఇస్తోందని మండిపడ్డారు. ఈ చట్టం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై గ్రామాల్లో వలసలు మరింత పెరుగుతాయని, పేదలకు ఉపాధి గ్యారంటీ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీని ఉరితీసే ఈ నూతన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి హామీ కార్మిక సంఘం నాయకులు అప్పన్న, సుంకయ్య, తెల్లన్న, రామారావు, లక్ష్మీనారాయణ, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల సమీపంలో వైన్ షాపులొద్దు

**- భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని స్థానికుల అభ్యంతరం**

**- ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్‌కు ప్రజాప్రతినిధుల ఫిర్యాదు**



**నరసన్నపేట, జులై 1(వార్త):** నరసన్నపేటలోని పెద్దపేట జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. దేవాలయాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినడంతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధార్మిక సంస్థలు, దేవాలయాలకు నిర్దిష్ట దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదని, అయినప్పటికీ పెద్దపేట జంక్షన్ సమీపంలో వైన్ షాప్ ఏర్పాటు చేయడం అభ్యంతరకరమని తెలిపారు. అలాగే జాతీయ రహదారికి సమీపంలోనే దుకాణం ఏర్పాటు చేయడంపై కూడా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, లక్ష్మీ గణపతి ఆలయం, నూకాంభిక అమ్మవారి ఆలయాలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా జగన్నాథ రథయాత్ర వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగే ప్రాంతంలో మద్యం దుకాణం ఉండటం సముచితం కాదని అభిప్రాయపడ్డారు

. వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, మాజీ వార్డు సభ్యులు పొట్నూరు కృష్ణప్రసాద్, పిల్ల గౌరీ తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెద్దపేట, నెయ్యిలవీధి, చాకలివీధి, సెగిడి వీధి, జగన్నాథపురం ప్రాంతాల ప్రజలు అధికంగా సంచరించే కూడలిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల సామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వైన్ షాప్ కారణంగా అసాంఘిక కార్యకలాపాలు పెరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

అధికారులు తగిన చర్యలు తీసుకోని పక్షంలో స్థానిక ప్రజలు, భక్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారకముందే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## శతాధిక మాజీ సర్పంచ్ మృతి



**పలాస, జులై 1 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం బాతు పురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు మాజీ సర్పంచ్ తామాడ పాపుడమ్మా 106 సంవత్సరాలు మంగళవారం సాయంత్రం ఆమె స్వగృహంలో మృతి చెందారు. మహిళలు హక్కులు అనగా పడుతున్న రోజుల్లో భర్త పోలినాయుడు స్ఫూర్తితో ఈమె ఈ ప్రాంత మొట్టమొదటి మహిళా సర్పంచిగా రాణించారు. అగ్నికుల క్షత్రియ కుల సంఘానికి కుల అధికారిగా, పెద్దగా వ్యవహరించి ఎన్నో కుటుంబాలను తీర్చిదిద్దారు. ఈమెకు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె కాగా ఆమె కుమార్తె తామాడ సరస్వతి బాతు పురం సర్పంచిగా అనేక సేవలు అందించారు. అంతేకాకుండా సరస్వతి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రత్యేక గాయనిగా సుపరిచితురాలు కావడమే కాకుండా మంచి పేరున్న కుటుంబం కావడంతో పాపుడమ్మ మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ ప్రాంత ప్రజలు వేలాదిగా స్వగృహానికి చేరుకుంటున్నారు. ఈమె మృతి పట్ల ఉద్దానము సాహితి సంస్కృతిక వేదిక అధ్యక్ష కార్యదర్శులు లండ రుద్ర మూర్తి, శివజ్యోతి, వంకల రాజారావు, వినోదు, సాగూరు నారాయణస్వామి, మురుపెల్లి బాబురావు, చిక్కోలు జగదీష్ తదితరులు తమ సంతాపాన్ని ప్రకటిస్తూ ఆమెకు నివాళులు అర్పించారు.

## పెద్దబొడ్డపాడులో పెన్షన్ పంపిణీలో శిరీష



**పలాస, జులై 1 (వార్త):** పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి నెలా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సేవను ఇంటి వద్దకే చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీనివాసరెడ్డికి వైసీపీ నేతల పరామర్శ



**పలాస, జులై 1 (వార్త):** పలాస మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కొయ్య శ్రీనివాసరెడ్డి అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గిరిబాబు, ఆయన త్వరితగతిన కోలుకొని తిరిగి ప్రజా సేవలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఎన్నో ఏళ్లుగా శ్రమించిన సీనియర్ నాయకుడికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మారడ భాస్కర్ రెడ్డి, రోణంకి వెంకటరమణ, గొర్ల వేణు, వల్లభ వైకుంఠరావు. వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**పలాస, జులై 1 (వార్త):** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలపై బుధవారం పలాస సామాజిక ఆసుపత్రి




నందు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి ఎం ఎస్. అనిల్ రాజు, కే లోకేశ్వరరావు పాల్గొని వైద్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు. ప్రజల ప్రాణాలను కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్న వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ వారి టోల్ ఫ్రీ నెంబర్ 15100, అదేవిధంగా వెబ్సైట్ వివరాలతో కూడిన పత్రికలను, ఉచిత న్యాయ సేవలు బ్యానర్ ను డాక్టర్స్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టీ పాపి నాయుడు, ఏవీఎం సుశీల, కే మనోహర్, బి.ఎన్.ఎస్ ఋషి, డీ జోత్స్న, బి వినోద్ కుమార్, హెడ్ నర్స్ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్‌ని కలిసిన సందీప్

**ఇచ్ఛాపురం, జులై 1(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా ఎస్.ఐ.ఆర్ టాస్క్ ఫోర్స్ సభ్యులు చినపాన సాయి సందీప్ రెడ్డి కలిశారు. తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమ పురోగతి, పార్టీ డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో సమన్వయంగా పనిచేసి ప్రతి అర్హులైన ఓటరు హక్కును పరిరక్షించేలా కృషి చేయాలని వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సూచించారని అన్నారు. పార్టీ కమిటీల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారని చెప్పారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

# ప్రాణదాతలు 108 సిబ్బంది

### గిరిజన మహిళకు ప్రాణాలు కాపాడిన గోపాలకృష్ణ, చంద్రశేఖర్

**మందస, జులై 1(వార్త):** నిజంగా ఓ వరం 108 అంబులెన్స్ వాహనం. అందులోని సిబ్బంది ప్రాణదాతలుగా కీర్తించబడుతున్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలు అమోఘం.. అమూల్యం. మందస మండలంలోని గిరిజన ప్రాంతంలో ఓ మహిళ ప్రాణాలను మందస 108 అంబులెన్స్ సిబ్బంది కాపాడారు. మందస మండలంలోని సవర తులసీగాం గ్రామానికి చెందిన స్వప్నకు పురిట నొప్పులు ప్రారంభమయ్యాయి. గిరిజన ప్రాంతం కావడంతో పాటు రాత్రి వేళ కూడా తోడయ్యింది. వైద్యం అందుబాటులో లేకపోవడంతో 108కు సమాచారం అందించారు. 108 కేంద్రం నుంచి మందస 108 అంబులెన్స్ సమాచారం చేరడంతో సిబ్బంది ఉప్పాడ గోపాలకృష్ణ, పైలట్ వై.చంద్రశేఖర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్వప్నను అంబులెన్స్ లో చేర్చి, కొద్ది దూరమే ప్రయాణించగా.. ఆమె పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ ప్రక్కకు నిలిపి 108 కాల్ సెంటర్ వైద్యుడు డాక్టర్ దినేష్ సలహాతో గోపాలకృష్ణ, చంద్రశేఖర్ పురుడు పోయగా, పండంటి మగబిడ్డకు స్వప్న జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డా ఇరువురు క్షేమంగా ఉండడంతో, వీరిద్దరినీ హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్సకై చేర్పించారు. గిరిజన మహిళ స్వప్న, బిడ్డను కాపాడిన గోపాలకృష్ణ, చంద్రశేఖర్‌కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. తరచూ ఇటువంటి సంఘటలు జరుగుతుండగా.. 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాణదాతలుగా ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు.



## కొర్లాంలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు




**సోంపేట, జులై 1(వార్త):** కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ నివారణ మాసో త్సవాలు బుధవారం నుంచి ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ ఎన్. రోషిని ఆధ్వర్యంలో సిబ్బంది ఈ సందర్భంగా కొర్లాం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానికులకు డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల,హెచ్ఈ వసంతకుమారి,ఏఎన్ఎం సుజాత,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ సందడి



**సోంపేట, జులై 1(వార్త):** సోంపేట పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సందడిగా జరిగింది. పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వార్డులకు వెళ్లి .. పేదలకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదండ రామాలయ కమిటీ చైర్మన్ బీన ఆనంద్ రావు,భీన ఈశ్వరరావు తదితరులు పింఛన్లు అందించి సక్రమంగా నగదు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైద్యులకు నేతల శుభాకాంక్షలు



**సోంపేట, జులై 1 (వార్త):** సోంపేటలోని పలువురు వైద్యులకు బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వివిధ సంఘాల నేతలు,స్వచ్ఛంద సంస్థల నేతలు,అభిమానులు స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు ఆధ్వర్యంలో అనేక మంది సభ్యులు ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ ను కలిసి దుస్సాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీశైన చైతన్య దీపిక ప్రతినిధులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఏవి రామకృష్ణ,డాక్టర్ టి.వెంకటేశములను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పేదల డాక్టర్ నిమ్మన దాసును సంస్కార భారతి విద్యాసంస్థల చైర్మన్ వై.దేవరాజు, ప్రిన్సిపాల్స్ శ్రీరామ్, కవి బాబు, ఏవో పాపారావు, వాసుపాణిగ్రహి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


### ప్రారంభానికి నోచుకోని..

# విలేజ్ హెల్త్ క్లినిక్

### -మూడేళ్లుగా ప్రజలకు అందని వైద్య సేవలు

### - త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని తలసముద్రం గ్రామస్థుల విజ్ఞప్తి

**పోలాకి, జులై 1(వార్త):** తలసముద్రంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం వినియోగంలోకి రాకపోవడంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం, అప్పటి ప్రభుత్వం సుమారు రూ.25 లక్షల వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించి పూర్తి చేసింది. అయితే నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రారంభించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రాథమిక వైద్య సేవల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని, విలేజ్ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి వస్తే గర్భిణులు, వృద్ధులు, చిన్నారులతో పాటు సాధారణ ప్రజలకు కూడా వైద్య సేవలు సులభంగా అందుతాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించి, వైద్య పరికరాలు ఏర్పాటు చేసి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను వెంటనే ప్రారంభించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్లినిక్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.




# బీసీ రాయ్ ఆశయాలను కొనసాగిద్దాం



**సోంపేట, జులై 1(వార్త):** వైద్య పితామహుడు, ప్రముఖ వైద్యుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిపిన్ చంద్ర రాయ్ ఆశయాలను కొనసాగిద్దామని వైద్యులు పునరుద్ఘాటించారు. సోంపేటలో బుధవారం రాత్రి జాతీయ వైద్యుల దినోత్సవం ప్రముఖ వైద్యులు డాక్టర్ ఏవీ రామకృష్ణ అధ్యక్షతన అధ్యంతం ఎంతో ఘనంగా జరిగింది.

### సన్మానం నభూతో నభవిష్యత్ :

ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సంపతిరావు రాజేంద్రప్రసాద్ కు చేపట్టిన ఘన సన్మానం నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు, సంఘాల ప్రతినిధులు ఎంతోమంది పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి సన్మానం చేశారు.

### రాజేంద్రుని సేవలు అమూల్యం :

వివిధ ప్రాంతాల్లో వైద్యునిగా విశేష సేవలు అందించి పేరుప్రక్యాతులు సంపాదించుకున్న రాజేంద్ర ప్రసాద్ సేవలు అమూల్యమని వైద్యులు పేర్కొన్నారు.

### సేవలకు పునరాంకితం అవుదాం :

వైద్య సేవలకు అందరం పునరాంకిదాం అవుదామని వైద్యులు పేర్కొన్నారు. వైద్య పితమహుడు బీసీ రాయ్ ఆశయాలకు అనుగుణంగా కృషి చేసి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇద్దామని అన్నారు. అంతకు ముందు బీసీ రాయ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.కార్యక్రమంలో డాక్టర్స్ లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి, దాసు, శివాజీ, వెంకటేష్, దుర్యోధన, జోగినాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ



**నరసన్నపేట, జులై 1(వార్త):** డాక్టర్స్ డే సందర్భంగా నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో వైద్యులు, న్యాయవర్గ ప్రతినిధులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొని మత్తు పదార్థాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎస్. వాణి, విశ్రాంత జడ్జి దుంపల ధర్మారావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల యువతతో పాటు కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ దురలవాట్ల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల సేవలను కొనియాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో వారి పాత్రను గుర్తు చేశారు. అనంతరం మత్తు పదార్థాల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నరసన్నపేట పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## 'బడి పిలుస్తోంది'తో సత్యవరం పాఠశాలలో 30 మంది చేరిక



**నరసన్నపేట, జులై 1(వార్త):** సత్యవరం మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి 30 మంది విద్యార్థులు నూతనంగా చేరినట్లు ప్రధానోపాధ్యాయులు అప్పలనాయుడు తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'బడి పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా చేపట్టిన విస్తృత ప్రచారానికి మంచి ఫలితం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) శాంతారావు, దాలినాయుడుతో కలిసి ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటా తిరిగి తల్లిదండ్రులను కలిశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల పట్ల విశ్వాసం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ కృషి ఫలితంగా ఈ ఏడాది రికార్డు స్థాయిలో 30 మంది విద్యార్థులు కొత్తగా పాఠశాలలో చేరడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కొత్త చేరికలతో పాఠశాల మళ్లీ పూర్వవైభవాన్ని సంతరించుకుంటోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయ బృందం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

# బొడ్డపాడులో 'అభయం' విజయవంతం

### - హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన పోలీసులు

**పలాస, జులై 1(వార్త):** బొడ్డపాడు గ్రామంలోపోలీస్ అధికారుల ఆధ్వర్యంలో కాశీబుగ్గ డి.ఎస్.పి భవాని ఆధ్వర్యంలో "అభయం" హెల్మెట్ అవగాహన చర్య విజయవంతంగా బుధవారం నిర్వహించారు బుధవారం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా అనేక ప్రాణాలను సంరక్షించవచ్చునని, ఇది బాధ్యత కూడా, ప్రయోజనమూ" అని అన్నారు. గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలను సాగించి 'అభయం గ్రామాలు'గా గుర్తించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు.ప్రజలందరినీ బహిరంగంగా వచ్చేలా కోరుకుంటూ, స్థానిక ట్రాఫిక్ శాఖ మళ్లీ ఇలాంటి అవగాహన కార్యక్రమాల్ని తరచుగా నిర్వహించాలని తెలిపారు. ప్రజల్లో రహదారి భద్రత, మహిళల రక్షణ,చట్టాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ వినియోగం, రహదారి భద్రత,

చట్టాలపై అవగాహన పొందారు. ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం




## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

### - చికిత్స పొందుతూ రిమ్స్‌లో కన్నుమూత

### - కేసు నమోదు, దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**నరసన్నపేట, జులై 1(వార్త):** కంబకాయ గ్రామానికి చెందిన తంగి సత్యనారాయణ (54) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి తంగి సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై జాతీయ ప్రధాన రహదారిపై సత్యవరం జంక్షన్ సమీపంలో వెళ్తుండగా ఓ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని వెంటనే శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై నరసన్నపేట ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

### - మడపాంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బగ్గు

### - సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని వెల్లడి



**నరసన్నపేట, జులై 1 (వార్త):** పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నరసన్నపేట మండలం మడపాం గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల పాలిట పెన్నిధిగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సామాజిక పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా రూ.4 వేల సామాజిక పింఛను అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15 వేల ప్రత్యేక పింఛను అందించే కార్యక్రమాన్ని కూడా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. పేదల సంక్షేమం, గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి శిమ్మ జగన్నాథం, మాజీ సర్పంచ్ చింతు రాజన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొద్దు సుందరరావు, చింతు మల్లేశ్వరరావు, ఉంగటి సింహాచలం, పల్లి శ్రీను, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది కొరతతో నరసన్నపేట ప్రజలకు ఇబ్బందులు

### - గ్రామసభలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యలపై ఆందోళన

### - సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ హామీ

**నరసన్నపేట, జులై 1(వార్త):** నరసన్నపేట పంచాయతీలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన గ్రామసభలో పలువురు గ్రామస్థులు పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయం వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నప్పటికీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) అందుబాటులో లేకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడిందని, ప్రజల ఫిర్యాదులను పట్టించుకునే పరిస్థితి లేదని గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్, గ్రామస్థులు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546